# నమస్తే తెలంగాణ

# మహబూబాబాద్

5 | వరంగల్, మంగళవారం 27 ఆగస్టు 2024 | MAHABUBABAD


విషజ్వరాలతో ఏజెన్సీ గ్రామాలు విలవిల్లాడుతున్నాయి. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్‌తో తండాలు, గూడేలు, పల్లెల్లో ఎటుచూసినా సీజనల్ వ్యాధులతో జనం మంచంపట్టగా తల్లడిల్లుతున్నాయి. జ్వరాలు ఇలా ప్రజలపై ముప్పేట దాడి చేస్తుండడంతో ప్రజలు వణికిపోతున్నారు. ఫలితంగా రోజుకు వందల సంఖ్యలో దవాఖానల్లో చేరుతుండడంతో రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఒక్కో చోట్ల ఊళ్లకు ఊళ్లు జ్వరాల బారిన పడగా సరైన వైద్య సిబ్బంది, అరకొర సేవలతో రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలా చోట్ల దవాఖానల్లో ఒకే బెడ్‌పై ఇద్దరికి చికిత్స అందిస్తుండగా బదిలీలు, డిప్యుటేషన్లతో మానుకోట జిల్లా గార్ల సీహెచ్‌సీలో ఒక్క వైద్యుడే చూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు అత్యవసర వైద్యం స్థానికంగా అందే పరిస్థితి లేకపోవడం, మందులు కూడా అరకొరగా ఇస్తున్నట్లు 'నమస్తే' ఫీల్డ్ విజిట్‌లో స్పష్టమైంది. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో జ్వరాల పరిస్థితిపై ప్రత్యేక కథనం..

*- నమస్తే నెట్‌వర్క్, ఆగస్టు 26*



ఏటూరునాగారంలోని సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులు



ఏజెన్సీ గ్రామమైన నల్లబెల్లి మండలం కొండాపూర్‌లో జ్వరంతో మంచం పట్టిన వృద్ధురాలు

# మంచంపట్టిన తండా

**విషజ్వరాలతో తల్లడిల్లుతున్న ఏజెన్సీ గ్రామాలు**

**సీజనల్ వ్యాధులతో ఆగమవుతున్న ప్రజలు**

- సరైన వైద్యం అందక రోగుల పాట్లు
- బదిలీలు, డిప్యుటేషన్లతో అరకొర సేవలు
- అత్యవసరమైతే జిల్లా దవాఖానకు పరుగులు
- పలుచోట్ల ఒకే బెడ్‌పై ఇద్దరికి చికిత్స

## నిలిచిన బయో కెమిస్ట్రీ పరీక్షలు



ములుగులోని ప్రభుత్వ దవాఖాన ఓపీ వద్ద రోగుల బారులు

ములుగు, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. అంతుచిక్కని రోగాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కీళ్ల నొప్పులు, జ్వరం, దగ్గు, జలుబుతోపాటు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ లాంటి విషజ్వరాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ దవాఖానతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు సమయానుకూలంగా వస్తున్నప్పటికీ సౌకర్యాల లేమితో సేవలందించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మందుల సరఫరా లేక, ల్యాబ్ రిపోర్టులు సమయానికి అందక రోగులు అవస్థలు పడుతున్నారు. జిల్లాలో 80 శాతం మేర రక్త, మూత్ర పరీక్షలు ప్రభుత్వ దవాఖానల్లో చేస్తున్నప్పటికీ కొన్నిచోట్ల ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. మందుల సరఫరా చాలినంత లేకపోవడంతో రోగులు కొన్నింటిని ప్రైవేట్‌లో కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 22 డెంగ్యూ, 45 మలేరియా, 65 టైఫాయిడ్ కేసులు నమోదైనట్లు డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య వెల్లడించారు.

**నిలిచిన పరీక్షలు**

ములుగు ప్రభుత్వ దవాఖానలో రోగ నిర్ధారణ పరీక్షల కోసం మూడేళ్ల క్రితం టీ డయాగ్నస్టిక్ సెంటర్ ఏర్పాటు చేశారు. జిల్లాలోని ప్రభుత్వ దవాఖానాలతో పాటు భూపాలపల్లి జిల్లాలోని కొన్ని పీహెచ్‌సీల పరిధిలోని రోగులకు ఉచితంగా 57 రకాల రక్త, మూత్ర పరీక్షలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఇందులోని యంత్రాలు మరమ్మతుకు గురవడంతో పరీక్షలు నిలిచిపోయాయి. దీంతో ఇక్కడి రోగుల రక్త నమూనాలను వరంగల్‌కు తరలిస్తున్నారు. వెంకటాపురం (నూగూరు) మండలంలోని సివిల్ దవాఖానకు ప్రతి రోజూ 200 మంది వస్తుండగా, అందులో దాదాపు 15 మంది ఇన్ పేషెంట్లుగా చేరుతున్నారు. ఈ దవాఖానలో కేవలం నలుగురు ఎంబీబీఎస్ వైద్యులు మాత్రమే ఉండటంతో వారిపై పని ఒత్తిడి పెరుగుతున్నది. ఒకే బెడ్‌పై ఇద్దరికి వైద్య సేవలందిస్తున్నారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని సామాజిక వైద్యశాలలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌లో యథావిధిగా వైద్య సేవలు కొనసాగుతున్నాయి.

## ఆస్పత్రులకు సుస్తీ



భూపాలపల్లి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ) : భూపాలపల్లి జిల్లాలోని ఆస్పత్రులకు సుస్తీ చేసింది. పారిశుధ్యం పడకేయడంతో ప్రతి ఇంట్లో ఒకరు విషజ్వరంతో బాధపడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అరకొర సిబ్బంది, నామమాత్రపు చికిత్సలు అందిస్తుండడంతో రోగులు ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్నారు. డెంగ్యూ కేసులు జిల్లాలో 20కి చేరగా 5 మలేరియా కేసులు నమోదయ్యాయి. జిల్లా కేంద్రంలోని 100 పడకల ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత రోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నది. ప్రస్తుతం ఆస్పత్రికి రోజుకు 500 నుంచి 600 మంది వస్తున్నారు. అయితే ఓపీ మధ్యాహ్నం 1 గంట వరకే మూసివేస్తుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రిలో ల్యాబ్, ఎక్స్‌రే, ఈసీజీ టెక్నీషియన్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఫార్మసిస్ట్‌ల కొరత తీవ్రంగా ఉంది. కేవలం ఒక్క రేడియాలజిస్ట్ మాత్రమే సేవలందిస్తున్నది. పలు వ్యాధి నిర్ధారణ పరీక్షలను ప్రజలు బయటే చేయించుకోవాల్సి వస్తున్నది. రోగుల తాకిడి పెరగడంతో ఆయా విభాగాల వద్ద క్యూ పెరుగుతున్నది. ఒక రేడియాలజిస్ట్ రోజుకు కేవలం 25 మందికి మాత్రమే స్కానింగ్ చేసి వెళ్లిపోతుండడంతో గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు.

**వైద్యులు, సిబ్బంది కొరత**

జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. జిల్లాలో ఒక జిల్లా వైద్యశాల, 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 2 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఒక అర్బన్ ఆరోగ్య కేంద్రం ఉన్నాయి. ఇందులో 9 ఆరోగ్య కేంద్రాల ద్వారా 24 గంటల వైద్య సేవలు అందుతున్నాయి. ఇందులో ఒక్కో దవాఖానలో నలుగురు వైద్యులు, నలుగురు ఫార్మాసిస్ట్‌లు ఉండాల్సి ఉండగా ఒక్కరు చొప్పున డాక్టర్, ఫార్మాసిస్ట్‌తో సేవలు అందిస్తున్నారు. అలాగే నర్సుల కొరత తీవ్రంగా ఉంది.

**చిట్యాలలో..**

చిట్యాల సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఆధ్వర్యంలోనే వైద్య సేవలు కొనసాగుతున్నాయి. రోజుకు 200 మంది ప్రజలు వైద్యం కోసం వస్తుండగా, 12 మంది వైద్యులకు ఆరుగురు మాత్రమే చికిత్స అందిస్తున్నారు. పిల్లల డాక్టర్ లేకపోవడంతో డెలివరీ అయిన మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీజనల్ వ్యాధులతో బెడ్స్ పూర్తిగా నిండిపోయాయి. చేసేదేమీలేక భూపాలపల్లి ఆస్పత్రికి పంపిస్తున్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ప్రభుత్వాసుపత్రిలో ఒకే బెడ్‌పై ఇద్దరు పేషెంట్లకు సెలైన్

## స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఒకే బెడ్‌పై ఇద్దరికి వైద్యం

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 26 : స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వాసుపత్రికి రోజూ 25 మంది వరకు జ్వరపీడితులు వస్తున్నారు. మీదికొండ, ఇప్పగూడెం, తాటికొండ, చిల్పూరు మండలం మల్కాపూర్ పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో విష జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉంది. లక్షలోపు ప్లేట్‌లెట్స్ ఉన్న వారికి చికిత్స అందిస్తున్నారు. సోమవారం ఆరుగురికి డెంగ్యూ పరీక్షలు చేశారు. మరోవైపు దవాఖానలో చాలినన్ని బెడ్స్ లేక ఒక్కో మంచంపై ఇద్దరికి సెలైన్ బాటిల్ ఎక్కిస్తున్నారు. 30 పడకల నుంచి 100 పడకల దవాఖానకు మారుస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చినా 20 బెడ్స్ కూడా లేవు. ఇటీవల ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ రిజ్వాన్ బాషా, ఆర్డీవో ఆసుపత్రిని సందర్శించినా సేవలు అందడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అనేక మంది ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయిస్తున్నారు.

### ఏటూరునాగారం దవాఖానకు క్యూ



డాక్టర్‌ను కలిసేందుకు క్యూ కట్టిన రోగులు

ఏటూరునాగారం, ఆగస్టు 26 : ఏటూరునాగారం, తాడ్వాయి, మంగపేట, కన్నాయిగూడెం మండలాలకు ఏకైక దిక్కుగా ఉన్న సామాజిక వైద్యశాలలో రోజు 200లకు పైగా ఓపీ ఉంటోంది. ఇందులో ఎక్కువ శాతం జ్వరాలతోనే వస్తున్నట్లు తెలుస్తోంది. బెడ్స్ సరిపోక ఎమర్జెన్సీ, ఐసీయూ వార్డులను కూడా జ్వర పీడితులకే వినియోగిస్తున్నారు. వారానికి 500లకు మందిపైగా జ్వరంతో వస్తున్నారు. ఇక మలేరియా, టైఫాయిడ్, వైరల్, డెంగీ జ్వరాలు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ వైద్యశాలలో ఓపీ వివరాలు పరిశీలిస్తే 20న 140 మంది, 21న 98మంది, 22న 167, 23న 163 మంది, 24న 88 మంది జ్వరంతో వచ్చారు. అటు ప్రైవేట్ వైద్యశాలలు కూడా కిక్కిరిసిపోతున్నాయి. ఇదే అదునుగా గ్రామాల్లో రక్త పరీక్షల పేరిట దోపిడీ చేస్తున్నారు.

## 200 మందికి ఒకే ఒక్కడు



క్యూలో నిల్చున్న రోగులు

మహబూబాబాద్, ఆగస్టు26 (నమస్తే తెలంగాణ) : మహబూబాబాద్ జిల్లాలోని గంగారం, కొత్తగూడ, గూడూరు, బయ్యారం, గార్ల ఏజెన్సీ మండలాలుగా ఉన్నాయి. ఈ ఏజెన్సీ మండలాల పరిధిలోని తండాలు, గూడేల్లో ప్రజలు జ్వరాలు ప్రబలి అరిగోస పడుతున్నారు. సోమవారం నమస్తే తెలంగాణ బృందం గార్ల మండల కేంద్రంలో ఉన్న కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించింది. ఇక్కడి 30 పడకల దవాఖానలో 10మంది వైద్యులకు గాను కేవలం ఒకే ఒక్కరే ఉండగా రోజుకు సుమారు 200 మంది ఓపీ చూడాల్సి వస్తోంది. ఎక్కువ మంది జ్వరంతోనే దవాఖానలో చేరుతున్నారు. అయితే రోగులను ఉదయం, సాయంత్రం పరీక్షించాల్సి ఉండగా గార్ల సీహెచ్‌సీని ఒక్కరే నడిపించాల్సి పరిస్థితి నెలకొంది. గత బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేసి రూ.5కోట్లతో అధునాతన హంగులతో 30 పడకల ఆసుపత్రిని నిర్మించారు. అంతేగాక అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించి 10 మంది వైద్యులను కూడా నియమించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొంతమందిని బదిలీ చేయగా, మరికొందరు డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఫలితంగా ఇప్పుడు కేవలం ఒక్క డాక్టరే మిగిలారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఈ డాక్టర్ అందుబాటులో ఉంటూ తర్వాత స్టాఫ్ నర్సు, నర్సులే రోగులకు దిక్కయ్యారు. రాత్రివేళ అత్యవసర వైద్యంతోపాటు జ్వరపీడితులకు రక్త పరీక్షలు చేయాలన్నా జిల్లా దవాఖానకు పంపించాల్సిందే. అంతేగాక రోగులకు అటు సేవలతో పాటు మందులు కూడా అరకొరగా ఇస్తున్నారు.

**డాక్టర్లు లేరు..**



నా వేలికి దెబ్బ తగిలితే చికిత్స కోసం గార్లలోని ఆసుపత్రికి వచ్చాను. ఉదయం 8గంటలకు ఆసుపత్రికి వచ్చి లైనులో నిలుచుంటే నా సీరియల్ వచ్చే సరికి మధ్యాహ్నం అయ్యింది. ఒక్క డాక్టరే అన్ని రోగాలకు చికిత్స చేస్తున్నాడు. డాక్టర్లు లేక ఇక్కడ రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అన్ని రకాల డాక్టర్లు లేకపోవడంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలపై నిర్లక్ష్యం చేస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందక ఇక్కడికి వచ్చిన ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం వస్తే సాయంత్రానికి కానీ వెళ్లే పరిస్థితి లేదు. అన్ని రకాల డాక్టర్లను ఇక్కడ నియమించాలి.

– మంద భిక్షం, రోగి, యాదనాయకపురం

## నలుగురు వైద్యులే దిక్కు

- ఇదీ మహదేవపూర్ దవాఖాన దుస్థితి
- వీధికుక్కల స్వైరవిహారంతో రోగుల బెంబేలు



దవాఖాన ఆవరణలో వీధి కుక్కలు

మహదేవపూర్, ఆగస్టు 26 : అది పేరుకే పెద్ద దవాఖాన. కానీ ఒకప్పుడు అన్ని సౌకర్యాలు, వసతులు, సరిపడా వైద్యులు, వైద్య సేవలతో కళకళలాడిన మహదేవపూర్ ప్రభుత్వ సామాజిక దవాఖాన ఇప్పుడు అధికారుల పర్యవేక్షణ కరువై రోగులకు చుక్కలు చూపుతోంది. దవాఖానలో 16మంది వైద్యులకు గాను బదిలీ కారణంగా ప్రస్తుతం నలుగురే ఉండడంతో పేద వైద్యులకు వైద్యం గగనమే అవుతోంది. మహదేవపూర్, కాటారం, పలిమెల, మహాముత్తారం, మల్హర్ మండలాలకు ఈ దవాఖానే పెద్ద దిక్కు. ప్రస్తుత సీజనల్ వ్యాధులు, విషజ్వరాలతో ప్రైవేటుకు వెళ్లలేని ఇక్కడి అనేక మంది వస్తున్నా పట్టించుకునే వారు ఆవేదన చెందుతున్నారు. ప్రతి చిన్న సమస్యకు కూడా జిల్లా దవాఖానకు, లేదా ఎంజీఎంకు సిఫారసు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేగాక దవాఖాన ప్రాంగణంలో పారిశుధ్యం అధ్వానంగా మారడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగు నీటితో పరిసరాలు కంపుకొడుతున్నాయి. అంతేగాక ఆవరణలో గుంపులు, గుంపులుగా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో రోగులు, బంధువులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ దృష్టి పెట్టి వైద్య సేవలందేలా చూడాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకొని, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని రోగులు, రోగుల బంధువులు, ప్రజలు కోరుతున్నారు.

**సమస్యలపై కలెక్టర్‌కు నివేదించాం**

– చంద్రశేఖర్, సూపరింటెండెంట్

మహదేవపూర్ దవాఖానలో వైద్యుల కొరత ఉన్న మాట వాస్తవమే. సరిపడా వైద్యుల కోసం, ఆసుపత్రిలోని సమస్యలపై కలెక్టర్‌కు ఇటీవలే నివేదించాం. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్, విషజ్వరాల బారిన పడి ఆసుపత్రికి వస్తున్న రోగులకు 24 గంటలు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తాం.

## ఆరోగ్య కేంద్రానికి ఆయా భర్తే దిక్కు!

- విధులకు హాజరుకాని డాక్టర్ సహా సిబ్బంది
- సూది, మందుల కోసం నిరీక్షించి ఇంటిబాట
- ఇదీ మేడపల్లి ఆస్పత్రి దుస్థితి



బెడ్‌పైన చిందరవందరగా పడి ఉన్న సెలైన్ బాటిల్స్

వరంగల్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ) : సీజనల్ వ్యాధులతో ఏజెన్సీ పల్లెలు మంచం పట్టిన వేళ.. ఆ ఆరోగ్య కేంద్రానికి ఆయా భర్తే దిక్కయ్యాడు. ఉదయం 8 గంటలకే ఆస్పత్రి డోర్లు తెరిచి కాపలాగా కూర్చున్నాడు. కానీ, అందులో పనిచేసే వైద్యుడు సహా ఇతర సిబ్బంది ఎవరూ విధులకు రాకపోవడంతో చికిత్స కోసం వచ్చిన ప్రజలు చాలా సేపు నిరీక్షించి.. సూది, మందు దొరకక ఇంటిబాట పట్టారు. ఇది వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మేడపల్లి 24 గంటల ఆస్పత్రి దుస్థితి. సోమవారం 'నమస్తే తెలంగాణ' క్షేత్రస్థాయి పరిశీలనలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. వరంగల్ జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ) 14, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీ) ఏడు ఉన్నాయి. ఈ పీహెచ్‌సీల్లో సంగెం, రాయపర్తి, దుగ్గొండి, మేడపల్లి 24/7 పనిచేయాల్సినవి. ఏజెన్సీలో ఉండే మేడపల్లి పీహెచ్‌సీ పరిధిలో నల్లబెల్లి మండలంలోని మేడపల్లి, రాంపూర్, నారక్కపేట, రుద్రగూడెం సబ్ సెంటర్లున్నాయి. కొద్దిరోజుల నుంచి వర్షాలు పడుతుండటంతో ఏజెన్సీ గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరం, అతిసారం తదితర వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో మేడపల్లి పీహెచ్‌సీకి బాధితులు వెళ్లగా వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వారు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం మేడపల్లి ఆస్పత్రిలో ఒక మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్సు, సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు ఎంపీహెచ్‌ఎస్‌లు, ఓ ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, దోబీ, ఆయా (నైట్ వాచ్‌మెన్)ను నియమించింది. వీరికి తోడుగా విధులు నిర్వర్తిస్తారని ఆయుష్ నుంచి మరో ముగ్గురు ఉద్యోగులను కేటాయించగా వారెవరూ విధులకు హాజరు కాలేదు.

**తెరిచి కాపలాగా ఉన్న ఆయా భర్త**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మేడపల్లిలో 24 గంటలు ప్రజలకు వైద్య సేవలందించాల్సి ఉంది. ఒక వైద్యుడితో పాటు ఓ నర్సింగ్ ఆఫీసర్ ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. అయితే ఈ పీహెచ్‌సీని సోమవారం ఉదయం ఇందులో పనిచేసే ఆయా (నైట్ వాచ్‌వుమెన్) తార భర్త ఈర్య 7 గంటలకు తెరిచి బయట కాపలాగా కూర్చున్నాడు. హాస్పిటల్‌కు ఆయనే పెద్ద దిక్కుగా మారారు. వైద్యుడు, సిబ్బంది మధ్యాహ్నం 12 గంటల వరకు డ్యూటీకి హాజరు కాలేదు. ఉదయం 8 గంటల నుంచే వైద్యం కోసం వచ్చిన ప్రజలు డాక్టర్ల కోసం వేచి చూసి ఇంటికి వెళ్లిపోయారు. 'నమస్తే తెలంగాణ' ఫీల్డ్ విజిట్ సమాచారం తెలియగానే ఆయుష్ విభాగం నుంచి విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు ఉద్యోగుల్లో ఒకరైన ఫార్మసిస్టు ప్రవీణ్ 11 గంటలకు ఆస్పత్రికి చేరుకున్నారు. తన భార్యకు జ్వరం రావడంతో తాను ఆస్పత్రిని తెరిచినట్లు ఆయా భర్త ఈర్య చెప్పారు.

**అందుబాటులో ఉండరు**



మేడపల్లి పీహెచ్‌సీలో వైద్యుడు, సిబ్బంది ఎవరూ సరిగా అందుబాటులో ఉండరు. ఎప్పుడో వస్తరు. మధ్యాహ్నం 12 గంటలైందంటే హాస్పిటల్‌లో కనపడరు. ఉన్న సమయంలో అయినా ఆస్పత్రికి వచ్చినోళ్లను పట్టించుకుంటరా అంటే అదీ లేదు. ఫోనులో మాట్లాడుతూ ఉంటరు. మేమొకటి చెపితే వాళ్లొకటి వింటరు. మా రోగం నయమయ్యేది ఇస్తరో.. మరో గోలి ఇస్తరో తెల్వదు. రెండు మూడు రోజుల నుంచి జ్వరం వస్తుందని ఇయ్యాల హాస్పిటల్‌కు వస్తే ఎవరు రాలే. చూసి చూసి వెళ్తున్న. పై వాళ్లెవరు పట్టించుకోవట్లేదు.

– కాసు బాబు, మేడపల్లి

## ఇనుగుర్తి.. చైతన్య దీప్తి

- తొలి తెలుగు పత్రికకు పురుడుపోసిన గడ్డ
- నిజాం సర్కారుకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం నింపిన పత్రిక
- ఒద్దిరాజు సోదరుల సారథ్యంలో ముద్రణ
- స్థాపించి నేటితో 102 సంవత్సరాలు
- ప్రభుత్వం ముద్రణాలయానికి మెరుగులు దిద్దాలని వేడుకోలు

**అవి నిజాం నిర్బంధం సాగిస్తున్న రోజులు. ఆ సమయంలో సర్కారుకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం నింపేందుకు, తెలంగాణ ప్రజలను ఉద్యమం వైపు నడిపించేందుకు ఇనుగుర్తి కేంద్రంగా పురుడు పోసుకుంది తెనుగు ప్రతిక. ఆంధ్ర నుంచి కొన్ని తెలుగు పత్రికలు ప్రచురితమవుతున్నా.. మన దగ్గరా ఒకటి ఉండాలనే ఆలోచనతో ఒద్దిరాజు సోదరులు సీతారాంచందర్‌రావు, రాఘవరంగారావులు 1922 ఆగస్టు 27న తెలంగాణ ప్రాంతంలో తొలిసారి తెలుగులో తెనుగు దినపత్రికను ముద్రించారు. నిజాం సర్కారు నుంచి ఎదురైన ఎన్నో అవరోధాలను అధిగమించి పత్రికను ప్రజల్లో తీసుకెళ్లి సనాతన ధర్మాలు, వేదాంత గ్రంథాలు, పలు మహాసభలు, చరిత్రాత్మక వ్యాసాల ద్వారా జాగృతం చేశారు. నేటితో పత్రిక స్థాపించి 102 ఏళ్లయిన సందర్భంగా ఒద్దిరాజు చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు ఒద్దిరాజు సుభాష్ ఆధ్వర్యంలో ఇనుగుర్తిలో శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.**

*- ఇనుగుర్తి, ఆగస్టు 26*



శిథిలావస్థలో ఉన్న ముద్రణాలయం





తెనుగు పత్రిక ప్రతి


-వివరాలు 9లో


## పదవి లేకున్నా వీవీఐపీ సెక్యూరిటీ

- డ్యూటీ రూల్స్‌నే మార్చేస్తున్న కొందరు ఖాకీ అధికారులు
- స్టేషన్ డ్యూటీ వదిలి మాజీ ఎమ్మెల్సీ కొండా మురళికి ఎస్కార్ట్‌గా విధులు
- ఇంతెజార్‌గంజ్, మిల్స్‌కాలనీ సీఐల నిర్వాకం
- పట్టించుకోని పోలీసు ఉన్నతాధికారులు



శ్రీపతిపల్లిలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ మురళీతో ఇంతెజార్‌గంజ్, మిల్స్‌కాలనీ సీఐలు

సుబేదారి, ఆగస్టు 26 : వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో కొందరు పోలీసులు నిబంధనలను అతిక్రమించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల మంత్రి కొండా సురేఖ పుట్టిన రోజు సందర్భంగా వరంగల్ ఏసీపీ, ఇంతెజార్‌గంజ్, మిల్స్‌కాలనీ సీఐలు, కొంత మంది సిబ్బంది మంత్రి అనుచరులతో కలిసి చేసిన హంగామా మరువకముందే మరో ఉదంతం వెలుగులోకి వచ్చింది. తాజాగా మంత్రి కొండా సురేఖ భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు సొంత పనికి ఇద్దరు సీఐలు ఎస్కార్ట్‌గా వెళ్లడం విమర్శలకు దారి తీసింది. సోమవారం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం శ్రీపతిపల్లి గ్రామానికి అనుచరులతో కలిసి మురళీధర్‌రావు దైవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయనకు వీవీఐపీ స్థాయిలో ఇంతెజార్‌గంజ్, మిల్స్‌కాలనీ సీఐలు శివకుమార్, మల్లయ్య ఎస్కార్ట్ డ్యూటీ చేయడం చర్చనీయాంశంగా మారింది. కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న కొందరు ఎస్సై, సీఐ, ఏసీపీ స్థాయి అధికారులు అధికార పార్టీ నేతల అండతో పోస్టింగ్ పొందిన తర్వాత వారు చెప్పినట్లు వ్యవహరిస్తున్నారు. పోలీసు శాఖ సర్వీస్ నిబంధనలు ఉల్లంఘించి ఆన్‌డ్యూటీలో ఉండి ప్రైవేట్ డ్యూటీ చేయడంపై ప్రజలు చీదరించుకుంటున్నారు. ఇదేనా పోలీసింగ్ అని ప్రశ్నిస్తున్నారు.

**నేడు ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో**

## రాష్ట్ర గవర్నర్ పర్యటన

**రాత్రి లక్నవరంలో బస**



ములుగు, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ)/ ములుగు రూరల్/ గణపురం : గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ నేడు ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11:30 గంటలకు రోడ్డు మార్గంలో ములుగుకు చేరుకొని ప్రభుత్వ అతిథి గృహంలో అరగంట పాటు బస చేయనున్నారు. 12 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జిల్లా అధికారులను పరిచయం చేసుకోనున్నారు. ఒంటి గంట నుంచి 3గంటల వరకు కలెక్టరేట్‌లో 25 మంది జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు పొందిన రచయితలు, కళాకారులతో సమావేశమై మధ్యాహ్నం భోజనం చేయనున్నారు. 3 గంటలకు రామప్ప దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేస్తారు. సరస్సును సందర్శించి జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని కోటగుళ్లను సందర్శించి పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 6:30గంటలకు గోవిందరావుపేట మండలం లక్నవరం సరస్సు వద్ద ఉన్న హరిత రిసార్ట్‌కు చేరుకుంటారు. మంగళవారం రాత్రి గవర్నర్ ఇతర అధికారులతో కలిసి బస చేయనున్నారు. బుధవారం ఉదయం 8గంటలకు హనుమకొండ జిల్లా పర్యటనకు వెళ్లనున్నారు.





కృష్ణాష్టమి వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్, గోపీగోపికల వేషధారణలో చిన్నారులు

## మార్గం మంచిదైతే విజయం తథ్యం

- ఎంపీ కడియం కావ్య
- వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

న్యూశాయంపేట, ఆగస్టు 26 : ఎంచుకున్న మార్గం మంచిదైతే విజయం తథ్యమని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. హంటర్‌రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్‌లో యాదవ వెల్ఫేర్ ట్రస్టు చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీత మానవాళికి అనుసరణీయమన్నారు. కష్టాలను ఎలా ఎదుర్కోవాలో, ద్వేషం ఎలా తగ్గించుకోవాలో గీత చదివితే అవగతమవుతుందని వివరించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో గొల్లకురుమలు కలిసికట్టుగా పాల్గొనడం హర్షణీయమన్నారు. సుందర్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణ పరమాత్ముడి జీవితం అందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో కాసం వెంకటేశ్వర్లు, కన్నెబోయిన రాజయ్య యాదవ్, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, ఎల్లావుల లలితా యాదవ్, సాంబయ్యయాదవ్ పాల్గొన్నారు. కాగా, ఓరుగల్లు శ్రీనివాసయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాట నృత్యాలు, ఉట్టి కొట్టే కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

## గోకుల కృష్ణ.. గోపాల కృష్ణా



కృష్ణాష్టమి పండుగను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. గోపీగోపికల వేషధారణలో చిన్నారులు సందడి చేశారు. హనుమకొండ గోకుల్‌నగర్‌లోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద యువకులు ఉట్టి కొడుతున్న దృశ్యం ఆకట్టుకుంది.

*- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్*